ప్రజాశక్తి

శుక్రవారం 20 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సిఎం పేషీకి 'బాలినేని'

- ధనుంజయరెడ్డితో భేటీ
- సిఎం జగన్‌ను కలిసే యోచన



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నకిలీ స్టాంపుల కుంభకోణం కేసు విచారణ తీరుపై అసంతృప్తిగా ఉన్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం నాడు సిఎం పేషీకి వెళ్లారు. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం చోటుచేసుకున్న కొన్ని తాజా పరిణామాలపై ప్రత్యేక కార్యదర్శి ధనుంజయ రెడ్డిని కలిసి చర్చించారు. నాలుగు రోజులుగా ఒంగోలులో జరుగుతున్న వ్యవహారాలను ఆయనకు వివరించారు. నకిలీ స్టాంపుల కేసు విచారణలో కలెక్టర్, ఎస్పీ తీరుపైనే అసంతృప్తి వ్యక్తం చేసిన బాలినేని.. వారి తీరుకు నిరసనగా తనకు కేటాయించిన గన్‌మెన్లు, బందోబస్తు వాహనాలను వెనక్కు పంపారు. హైదరాబాద్ నుంచి ఉదయం ఆయన ఒంటరిగానే విజయవాడ ▶ 2లో



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పి మల్లికగర్గ్

అమరవీరుల దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

అధికారులకు ఎస్పి మల్లికగర్గ్ సూచనలు పేజీ ▲

కులగణన

వాలంటీర్లతో సాధ్యమేనా.?



- చట్టబద్ధత లేని నిర్ణయంతో భవిష్యత్‌లో సమస్యలు
- ఎన్నికల నాటికి కులాల జనాభా తేల్చేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కులగణన ముందుకు వచ్చింది. కేంద్రం సాధ్యం కాదని ప్రకటించింది. అయితే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం బీసీ జనాభా తేల్చేందుకు ఇప్పుడు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన గోపాల కృష్ణ నవంబర్ 15 నుంచి కులగణన చేపడు తున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియను వాలం టీర్లతో చేయిస్తామని చెబుతున్నారు. దీనిపై చర్చ మొదలైంది. వాలంటీర్లతో ఇది సాధ్య మేనా? చట్టబద్ధత లేని నిర్ణయాలతో సజావుగా సాగుతుందా? అనే సందిగ్ధం నెలకొంది. రాజకీయ కోణంతో ఉన్న వాలంటీర్లలో కులగణన చేయిస్తే గణాంకాలు సక్రమంగా రావనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల్లో ఓట్ల కోసం చేస్తున్న తంతుగా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే వైసిపి వచ్చే ఎన్నికల్లో వాలంటీర్లను, గృహ సారథులను సమర్ధవంతంగా వినియోగించుకొని గెలుపు వ్యూహం అమలు చేయాలని నిర్ణయించింది. వాలంటీర్లను సత్కరించి వారికి ఎన్నికల్లో గెలుపు ఉపదేశం చేశారు. వాలంటీర్లతో ఇప్పటివరకూ సంక్షేమ కార్యక్రమాల అమలు ఎజెండాను నడిపారు. వీరి నియామకమే స్పష్టత లేదు. వీరితో ఇప్పుడు కులగణన ఎలాంటి సమస్యలకు దారితీస్తుందోన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా స్పష్టమైన ప్రకటన చేశారు. కులగణణ వాలంటీర్లతో చేయిస్తే ఎన్నికల్లో ఓట్ల కోసం జరిగేదిలా ఉంటుందన్నారు. చట్టబద్ధత కల్పించాలని, ఇందు కోసం రెవెన్యూ యంత్రాంగాన్ని వినియోగించి కట్టుదిట్టంగా చేయాలని సూచించారు. లేకుంటే భవిష్యత్‌లో సమస్యలు వస్తాయని హితవు పలికారు. చాలాకాలంగా బీసీ జనాభాను తేల్చాలనే డిమాండ్ ఉంది. బీసీ సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు కూడా కోరుతున్నాయి. అందుకు కేంద్రం సుముఖంగా లేదు. ఇప్పుడు ఎన్నికల్లో బీసీ ఓట్లు కీలకంగా మారాయి. జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు చట్టసభల్లోనూ ప్రాధాన్యత లేదు. జనాభా లెక్కల కోసం జాతీయస్థాయిలో విధివిధానాలున్నాయి. ఈ విధానాన్నే బీసీ జనాభాకూ అంటే కులగణనకు వినియోగించాలనే చర్చ ఉంది. 1931లో తొలిసారిగా జనాభా లెక్కలను అంచనా వేసినప్పుడు అన్ని కులాల లెక్కలు తేల్చారు. ఆ తర్వాత బీసీల జనాభా లెక్కలను అప్‌డేట్ చేయలేదు. తర్వాత ఎస్సీ, ఎస్టీ జనాభా గణన చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక బీసీల గణన జరగలేదు. అయితే 2011లో కాంగ్రెసు ప్రభుత్వం బీసీల జనాభా గణన చేపట్టిన గణాంకాలను వెల్లడించలేదు. గోప్యంగా ఉంచారు. బీసీలు మొత్తం జనాభాలో 55 శాతం ఉన్నట్లు బీసీ సంఘాల అంచనా. మధ్యలో రాజకీయ నేతలు నియోజకవర్గాల్లో అనధికారికంగా బీసీలు, ఎస్సీలు, ఇతర కులాల జనాభా ఎంతనే లెక్కలు సర్వే బృందాలతో తేల్చారు. ఇవన్నీ అనధికారికంగానే ఉన్నాయి. వాటి అంచనాల మేరకు జనాభాలో బీసీలు 55 శాతం ఉన్నట్లు ▶ 2లో



బాపట్లలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష పేజీ ▲

భూ కుంభకోణం కేసులో

మరో ఐదుగురు అరెస్టు

- దూకుడు పెంచిన ప్రకాశం పోలీస్
- 33 రౌండ్ సీల్స్ స్వాధీనం
- ప్రజలకు అనుమానాలుంటే పోలీసులను సంప్రదించాలి
- ఎస్పి మల్లికగర్గ్ సూచన



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నకిలీ రబ్బర్ స్టాంపులు, భూకుంభకోణం కేసులలో ప్రకాశం జిల్లా పోలీసులు దూకుడు పెంచారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. దీంతో నకలీ రబ్బరు స్టాంపులు, తప్పుడు దస్తావేజుల కేసులకు సంబంధించి అరెస్టయిన నిందితుల సంఖ్య 12కు చేరింది. త్వరలోనే మరింత మందిని అరెస్టు చేయటానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. నలుగురు నిందితుల అరెస్టుకు సంబంధించి జిల్లా ఎస్పి మలికాగర్గ్ ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 25న ఒంగోలు నగరంలో స్వాధీనపరచుకున్న నకిలీ రబ్బరు స్టాంపులు, ఫోర్జరీ దస్తావేజుల కేసుకు సంబంధించి సిట్ ఆధ్వర్యంలోని దర్శి డిఎస్‌పి అశోక్ వర్ధన్, టీమ్ మెంబర్స్ అయిన తాలూకా సిఐ భక్తవత్సల రెడ్డి గురువారం సాయంత్రం నలుగురు నిందితులను అరెస్టు చేసి.. రిమాండు రిపోర్ట్ ద్వారా కోర్టుకు పంపామని, వారు నుంచి కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలియజేశారు.

అరెస్టయిన నిందితులు..

రావి శ్రీనివాసరావు(53) కోరిశపాడు మండలం రాచపూడి గ్రామం. గతంలో హైదరాబాద్‌లో ఆంధ్రజ్యోతి, ఈనాడు, వార్తా పత్రికలలో పనిచేశాడని, ఆ తరువాత ఒంగోలులో ఆంధ్రప్రభ, సూర్య దినపత్రికలో జిల్లా జర్నలిస్ట్‌గా పనిచేశాడని పేర్కొన్నారు. ఇతను గత ఆరు సంవత్సరాల నుంచి అటవీ శాఖలో ఔట్ సోర్సింగ్ పిఆర్‌ఒగా పనిచేస్తున్నాడన్నారు. వేములపాటి శ్రీనివాసులు(51) ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడన్నారు. బూచి వనమాలి(53) ఒంగోలు కొణిజేడు బస్టాండ్ విఇస్తరాకులు, వాటర్ ప్లంబింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. కంది సుధాకర్‌రెడ్డి మద్దిపాడు మండలం ఇనమన మెళ్ళూరు గ్రామం. కోల్డ్‌స్టోరేజ్ వ్యాపారం. ఈ నెల 10న ఒంగోలు పట్టణం లోని న్యాయవాది ఐనాబత్తిన సుబ్బారావు ఫిర్యాది మేరకు తాలూకా పోలీసుస్టేషన్‌లో ▶ 2లో

టెక్స్‌టైల్ మిల్లులో అగ్ని ప్రమాదం

- అగ్నికి ఆహుతైన యంత్రాలు
- రూ.కోటి నష్టమంటున్న మిల్లు నిర్వాహకులు



మిల్లులో ఎగసిపడుతున్న మంటలు, మిల్లులో పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు ఎన్.ఎస్.ఎల్ టెక్స్‌టైల్ మిల్లులో వీవింగ్ యూనిట్ (బట్ట తయారీ విభాగం)లో గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ముందుగా పొగలు రావడంతో అప్పుడు అక్కడ పనిచేస్తున్న సుమారు 200 మంది కార్మికులు ఉలిక్కిపడ్డారు. ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. నూలు ఉండటంతో మంటలు త్వరగా వ్యాపించాయి. అగ్ని ప్రమాదంలో నాలుగు సైజింగ్ మిషన్లు, 9 వార్పింగ్ మిషన్లు, ఐదు ఆటోకోన్స్ మిషన్లు, రెండు రీవైండింగ్ మిషన్లు, మూడు వేల క్వింటాళ్ళ కాటన్ బీములు, దారం కాలిపోయాయి. సుమారు రూ.కోటి వరకు నష్టం జరిగిందని హెచ్‌ఆర్ మేనేజర్ రత్నం తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించి.. వెంటనే కార్మికులంతా వెంటనే బయటకు వెళ్లిపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే చీరాల, అద్దంకి, ఒంగోలు అగ్నిమాక కేంద్రాల నుంచి అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపుచేశాయి. అప్పటికే విలువైన వస్తువులు, మిషన్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మొత్తం ఎంత నష్టమనేది అంచనా వేస్తున్నట్లు బాపట్ల జిల్లా ఫైర్ ఆఫీసర్ వివి.రామకృష్ణ తెలిపారు. సంఘటనాస్థలాన్ని ప్రకాశం జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, బాపట్ల జిల్లా ▶ 2లో

కులగణన వాలంటీర్లతో సాధ్యమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

చెబుతూనే ఉన్నారు. ఏదీ అధికారికంగా గుర్తించలేదు. కులసంఘాలు కూడా సొంత సర్వేలు చేసుకుని తమ జనాభా ఇంతమంది ఉన్నామని ఎన్నికల సమయాల్లో పార్టీల వేదికలపై ప్రకటనలు చేస్తుంటారు. కులసంఘాల సమావేశాల్లోనూ ఈ లెక్కలు చెబుతుంటారు. అధికారికంగా తేల్చాలనే డిమాండ్ న్యాయబద్ధంగానే ఉంది. ప్రస్తుతం చేపడుతున్న కులగణన ఎంత మేరకు సజావుగా సాగుతుందనేదీ సందేహంగా మారింది. ఎందుకంటే వాలంటీర్లతో ఈ ప్రక్రియను చేయిస్తే అనుమానాలకు తావివ్వనుంది. వాలంటీర్లలో ఎక్కువ మంది వైసిపి కార్యకర్తలుగానే ఉన్నారు. తాము యంత్రాంగంలో భాగమనే ఆలోచన వారిలోనూ లేదు. ఎందుకంటే వారి నియామకమే అలా చేశారు. కులగణనకు ప్రత్యేక యంత్రాంగాన్ని పెట్టాలి. అధికారికంగా దీన్ని పకడ్బందీగా చేపట్టాలి. అప్పుడే దీనికి విలువ ఉంటుంది. కులగణనకు ప్రాధాన్యత ఉంటుంది. వాలంటీర్లతో చేయిస్తే నమ్మసక్యంగా ఉండే అవకాశం ఏ మేరకు ఉంటుందో సందేహమే.. జిల్లాలో 29 బీసీ కులాలున్నట్లు సమాచారం. వీరి జనాభా ఎంత అనేదీ చూడాలి. అందరూ వృత్తిదారులుగానే ఉన్నారు.

వాలంటీర్లతో సాధ్యం కాదు

ఓబీసీ సంఘం అధ్యక్షుడు వీరభద్రాచారి

కులగణన ఎప్పటినుంచో ఉన్న డిమాండ్ అని, దీన్ని వాలంటీర్లతో చేయిస్తే పార్టీ గణన అవుతుందే తప్ప కులగణన కాదని ఓబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.వీరభద్రాచారి అన్నారు. జనాభా లెక్కల కోసం 1931లోనే కేంద్రం ఒక విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఆ విధానం ప్రకారమే చేయాలన్నారు. చట్టబద్ధంగా యంత్రాంగాన్ని పెట్టి చేయించాలన్నారు. వాలంటీర్లతో చేయిస్తే దాన్ని పూర్తిగా నమ్మలేమన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. శాస్త్రీయపద్ధతిలో కులగణన సాగాలన్నారు. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టినా గణాంకాలను వెల్లడించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కూడా బీహార్ ప్రభుత్వం మాదిరిగానే కులగణన కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని పెట్టి చేపట్టాలన్నారు.

భూకుంభకోణం కేసులో.. మరో ఐదుగురు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

నమోదైన నమోదు కేసుకు సంబంధించి ఇంట్లో అద్దెకు చేరి, తహశీల్దార్ కార్యాలయం ఇచ్చినట్లుగా తయారుచేసిన నకిలీ పొజిషన్ సర్టిఫికెట్స్, నకిలీ అగ్రిమెంట్ల ద్వారా ఆ ఇల్లే తన తండ్రి ద్వారా సంక్రమించిందని చెప్పిన ఒంగోలుకి చెందిన నిందితుడు పమిశెట్టి జయరాజు(43)ను బుధవారం రాత్రి సిట్ మెంబర్ అయిన కొండపి సిఐ పాండురంగారావు అరెస్టు చేసి.. గురువారం రిమాండ్ రిపోర్ట్ ద్వారా కోర్టుకు పంపామన్నారు. ఈ కేసుకు సంబందించి ఇతర నిందితులు పూర్ణచంద్రరావు, యానాది రావు, రవీంద్రబాబు, విష్ణువర్ధన్‌లను నకిలీ స్టాంపుల కేసులో గత నెల అరెస్టు చేసి.. కోర్టుకు పంపామని, వారు వారు ప్రస్తుతం ఒంగోలు జైలులో ఉన్నారని ఎస్‌పి తెలియజేశారు.

33 రౌండ్ సీల్స్ స్వాధీనం

నకిలీ స్టాంపుల కేసులో నిందితుల నుంచి వివిధ తేదీలు కలిగిన 33 రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి తెలియజేశారు. ఒంగోలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పేర రౌండ్ సీల్స్ వివిధ తేదీలు 10.11.2014, 30.04.2015, 04.09.2015, 09.09.2016, 25.11.2016, 18.03.2017, 20.04.2017, 07.04.2018, 14.02.2018, 23.07.2018, 11.10.2018, 22.12.2018, 20.02.2019, 29.07.2019, 14.10.2020, 17.06.2021, 20.07.2021, 05.08.2021, 26.10.2021, 17.11.2021, 09.12.2021, 21.12.2021, 19.01.2022, 19.05.2022, 01.08.2022, 25.08.2022, 03.09.2022, 22.09.2022, 16.11.2022, 27.12.2022, 27.01.2023, 09.02.2023, 23.02.2023 స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనపరుచుకున్న వీటికి సంబంధించి.. ఏవైనా పత్రాలలో పై తేదీలు ఉన్న సీల్స్ ఉన్నాయని అనుమానం ఉంటే తాలూకా సిఐ, ఒంగోలు డిఎస్‌పిని సంద్రించాలని జిల్లా ఎస్‌పి ప్రజలను కోరారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొనకనమిట్ల

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ అక్క చెల్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, వాలంటీర్లు మీ ఇళ్లకు వచ్చి సంక్షేమ పథకాలను వివరిస్తున్నారా అని ఆరా తీశారు. వాలంటీర్లు అందుబాటులో లేకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులకు తెలియజేయాలని కోరారు. అనంతరం గొట్లగట్టులో రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసమూర్తి, వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, ఎపిఎం గోపాలకృష్ణారెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపిటిసి ఉడుముల రామనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు కాశిరెడ్డి, కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచులు బత్తుల మాలకొండయ్య, బాలగురవయ్య, మాజీ ఎంపీటీసీలు గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి వెంకటయ్య, నాయకులు పోలసాని నారాయణరెడ్డి, కె డేవిడ్, చలమారెడ్డి, నాగం ప్రసాద్, సుబ్బయ్య, అంజయ్య, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుందురు

ఎంఎస్ రాజు సైకిల్ యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వెలిగండ్ల

టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు చేపట్టిన సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని టీడీపీ వెలిగండ్ల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోన వెంకటయ్య కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరితంగా, నిరాధారమైన ఆరోపణలతో అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఈ యాత్ర జరుతున్నట్లు తెలిపారు. అనంతపురం నగరంలోని అంబేద్కర్ బొమ్మ దగ్గర నుంచి మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ వరకు (అమరావతి) చేపట్టిన సైకిల్ యాత్ర 20వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు కనిగిరి నియోజకవర్గం పరిధిలోని పామూరు చేరుకుంటుందని వెలిగండ్ల మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ తెలిపారు. కనిగిరి నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల ఎస్సీ సెల్ నాయకులు ఉదయం 10 గంటలకు పామూరు చేరుకొని ఎంఎస్ రాజు చేస్తున్న సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కనిగిరి

నవంబర్ 7న హైదరాబాదులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర, మహాసభను జయప్రదం చేయాలని నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు తాతపూడి సురేష్‌బాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు జెపి రాజు కోరారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కనిగిరి మండలం చినఇర్లపాడు, వాగుపల్లి, శంకవరం గ్రామాల్లో గురువారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ శీతాకాలపు చివరి సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో అలంపూర్ నుంచి హైదరాబాదు వరకు మందకృష్ణ మాదిగ పాదయాత్ర నిర్వహించి మహాసభలో పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మాదిగలు, ఉపకులాల వారు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో నేలపాటి రవి, గోచిపాతల చిన్న బాబు, సుధీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

సిఎం పేషీకి 'బాలినేని'

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. సిఎం పేషీకి వెళ్లి కొన్ని విషయాలు ధనుంజయరెడ్డితో చర్చించారు. అయితే బాలినేని సిఎం జగన్‌ను కలిసేందుకు విజయవాడ వచ్చారనే చర్చ పార్టీ వర్గాల్లో జరిగింది. అయితే ఆయన కర్నూలు జిల్లా పర్యటనకు వెళ్లి సాయంత్రం తాడేపల్లికి చేరుకున్నారు. ఈ కారణంతో సిఎం జగన్‌ను కలిసే అవకాశం రాలేదు. అయితే బాలినేని మాత్రం సిఎం జగన్‌ను కలిసి అన్ని విషయాలు చర్చించాలనే ఆలోచనలో ఉన్నారు. సిఎం జగన్‌ను శుక్రవారం నాడు కలిసే అవకాశం ఉంది. సిఎంతో బాలినేని జరపబోయే భేటీపైనే పార్టీ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది.

టెక్స్‌టైల్ మిల్లులో అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఫైర్ ఆఫీసర్ వి.వి రామకృష్ణ, చీరాల డిఎస్‌పి ప్రసాద్‌రావు, చీరాల ఆర్‌డిఒ సరోజిని, అద్దంకి రూరల్ సిఐ ఉమేష్, ఇంకొల్లు తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, ఇంకొల్లు, చిన్నగంజాం ఎస్‌ఐలు షేక్ నాయబ్ రసూల్, సురేష్, వై.సి.పి పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పరిశీలించారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి.

ప్రకాశం జిల్లా పొదిలి మండలం, పొదిలి గ్రామానికి చెందిన మచ్చా వెంకట సురేష్ తండ్రి వెంకటాచారికి చెందిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. నేను సర్వే నెంబర్ 891/7, ఎ.0-45 సెంట్లు భూమిని వెలిశెట్టి వెంకటేశ్వర్లు గారి వద్ద కొనుగోలు చేసి పొదిలి సబ్‌రిజిస్టార్ వారి ఆఫీస్ నందు దస్తావేజు నంబర్:3303/2020 ద్వారా హక్కులు పొంది ఉన్నాను. సదరువెలిశెట్టి వెంకటేశ్వర్లు గారు కోటు సాంబశివరావు తండ్రి వెంకట నరసింహం వద్ద కొనుగోలు చేసిన దస్తావేజు నెంబర్: 5002/2011 కలదు. సదరు దస్తావేజు :5002/ 2011 డాక్యుమెంట్లు పొదిలి భారతీయ స్టేట్ బ్యాంకు వెళుచుండగా మార్గ మధ్యంలో పోయినవి. ఈ ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయ వలసిందిగా కోరు చున్నాము. ఇవి దొరికిన వారు మాకు అందజేసిన యెడల వారికి తగిన పారితోషికం ఇవ్వగలవారము.

ఇట్లు
మచ్చ వెంకట సురేష్
తండ్రి వెంకటాచారి,
పొదిలి టౌన్, మండలం
ప్రకాశం జిల్లా. 523270.
సెల్ :9848345737

నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఒంగోలు, ప్రకాశంజిల్లా.

O.S No.83/2023

జగన్నాథం వసంతరావు .... వాది

Vs

కొంపల్లి నాగవిజేత .... ప్రతివాది

To

కొంపల్లి నాగ విజేత S/o లేట్ శివరామకృష్ణ,
R/o ప్లాట్ నెం:503, 4వ ఫ్లోర్,
భారతి టవర్స్ అపార్ట్మెంట్స్, సంతపేట,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

వాది మీ పై ప్రోనోటు బాకీ వసూలు కొరకు దాఖలు చేసిన పై దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు జారీ నిమిత్తం తేది : 01-11-2023 న వాయిదా అయి ఉన్నది. పై తేదీన మీరు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పైన తెలిపిన కోర్టులో మీరు స్వయంగా గాని, లేదా వకిలు ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలను తెలుపుకొనవలసినది లెనియెడల మీపరోక్షంగా కేసు తీర్మానించబడునని తెలియ జేయడం అయినది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఇట్లు
నగరికంటి శ్రీనివాసరావు
అడ్వకేట్, ఒంగోలు
ప్రకాశం జిల్లా.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు :తెనాలి.

E.P.No:88/2021 in O.S.83/2019.

బిట్వీన్:
తుంగల నాగబసవయ్య .....DHR/Plaintiff
ఎదిరి
R: జవ్వాజి సుధాకర్ S/o బాలచంద్రరావు, హిందూ 49 సం: వ్యాపారము, R/o పెరవలిపాలెం, వేమూరు మండలం, బాపట్ల జిల్లా .... Jdr/Defendent.

పై నెంబరు E.P నందు Jdr కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనుటలేదు. అందువలన శ్రీయుత కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు E.P ది:30-10-2023 తేదీన వాయిదా అయి యున్నది. కావున మీరు స్వయంగా గాని మీ న్యాయవాది ద్వారా గాని ఆరోజు ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అక్షపణలు తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షము నందు శ్రీయుత కోర్టువారు తీర్మానం చేయగలరని తెలుపడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదాతేది : 30-10-2023

Dhr తరుపు న్యాయవాదులు..
పర్చూరి రాఘవేంద్రరావు, సోలా శంకర్,
న్యాయవాదులు, తెనాలి.
సెల్ : **9346830824.**

దావా నోటీసు

ఒంగోలు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 94/2021

చేజర్ల విజయలక్ష్మి ...వాది

వర్సెస్

చేజర్ల మంగయ్య ....ప్రతివాది

To

చేజర్ల మంగయ్య, తండ్రి లేట్ మంగయ్య,
హిందూ వయస్సు 80 సంవత్సరాలు వ్యవసాయం
చేజర్ల గ్రామం మరియు పోస్ట్ ఒంగోలు మండలం
ప్రకాశం జిల్లా

పై తెలిపిన కోర్టు వారి ఎదుట పై తెలిపిన వాది పై తెలిపిన దావా నెంబర్ న షెడ్యూలు దాఖలా ఆస్తికి తనకు వ్రాసి ఇచ్చిన తేది 23-05-2017 సెటిల్‌మెంట్ పత్రము ప్రకారము హక్కు దారురాలుగా, ఓనర్‌గా డిక్లేర్ చేయించమని ప్రతివాది మరియు అతని మనుషులు, అతనిని అనుచరించు మను ష్యులు వాది అనుభవంలో ఉన్న షెడ్యూలు ఆస్తిలోనికి ప్రవేశించకుండా పర్యవసారంగా శాశ్వత నిషేధ ఉత్తర్వులు కోరుచూ దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 16-11-2023కి వాయిదా అయిఉన్నది ఇందు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణ లున్ననూ పై తెలిపిన తేది 16-11-2023న ఉదయం 10:30కి పై తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరపడి మనవిచేసుకొనవలెను లేనియెడల మీ పరోక్షమందు పైదావాను తీర్మానంచేయుదురని తెలపడమైనది

షెడ్యూలు

ఐటంనం : 1 ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రీ ఒంగోలు మండలం చేజర్ల గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 238/2 య 0.73 సెంట్లు మరియు సర్వే నెం237/1 లో య 0.25 సెంట్లు (సింగిల్ బిట్) మొత్తం య 0.98 సెంట్లు లోని య 0.07 సెంట్లు అమ్మగా మిగిలిన య 0.91 సెంట్స్ హద్దులు
తూర్పు : చేజర్ల రాఘవరావు
ఉత్తరం : పొగతోట
దక్షిణం : సుబ్బరామయ్య ఇల్లు
పడమర : పొగ తోట
ఐటంనం :2 అర్.సీ.సి, బిల్డింగ్ ఒక గదిలో నిర్మితమై మిగిలిన 16 గదుల ఖాళీ స్థలమునకు హద్దులు
తూర్పు : ఉప్పలపాడు పురుషోత్తం ఆస్తి,
దక్షిణం : చేజెర్ల సుబ్బరామయ్య ఆస్తి
పడమర : టుబాకోగార్డెన్,
ఉత్తరం : టుబాకో గార్డెన్
ఐటంనం : 3 ప్రకాశం జిల్లా సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రీ పేర్నమిట్ట సర్వేనెంబర్ 104, ప్లాట్ నెంబర్ 82 కు హద్దులు
తూర్పు : రోడ్డు
దక్షిణం : రోడ్డు
పడమర : కృష్ణారెడ్డి భూమి
ఉత్తరం : యం.వెంకటేశ్వర్లు భూమి ఈ హద్దులలోని 2501చదరపు అడుగులు లేదా 34 గదుల 53 చదరపు అడుగులు లేదా277.8/9 చ , గజములు

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : 18-10-2023

ఇట్లు
గొర్రెముచ్చు నరసింహారావు
వాది తరపు అడ్వకేట్
ఒంగోలు



పాటలు పాడుతున్న విద్యార్థినులు

కొనసాగుతున్న 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో గురువారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులతో నీతి కథలు చదివించారు. పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ పోటీలు పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకుడు డి వెంకట సుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. **గిద్దలూరు :** గిద్దలూరు శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథ పాలకురాలు ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో కథలు, పత్రికలు, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు, వైజ్ఞానిక విశేషాలను విద్యార్థులు చదివి తమ విజ్ఞానాన్ని పెంపొందించువచ్చుని చిన్నారులకు ఆమె తెలిపారు. **కొండపి :** చిన్నతనం నుంచే నీతికథలు, బాలమిత్ర కథలు వంటి వాటిని చదవడం నేర్చుకొని అందులోని నీతికి గ్రహించాలని కొండపి శాఖ గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో దసరా సెలవుల సందర్భంగా చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలో 10 మంది విద్యార్థులు హాజరై పుస్తకాలు పఠనం, కథలు, పాటల పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చిన్నతనం నుంచే అలవాటు చేసుకొని పుస్తక పఠన శక్తిని పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న ఎఒ విష్ణుప్రియ

సుగంధ పంటల పెంపకం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ఉద్యానవన శాఖ అరోమా మిషన్ ద్వారా సుగంధ పంటల పెంపకము కార్యక్రమము చేపట్టినట్లు ఉద్యానవన శాఖ ఎఒ పి విష్ణు ప్రియ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు మండలం గడికోట గ్రామములో సాగు అవుతున్న నిమ్మగడ్డి పొలాన్ని సాగు చేయాలనుకునే రైతులతో కలసి సందర్శించారు. నిమ్మగడ్డి పంట సాగు చేసుకోవాల్సిన విధానము, నిమ్మగడ్డి నుంచి నూనెను తయారు చేసుకునే విధానం గురించి నిమ్మగడ్డి సాగు చేస్తున్న రైతు రంగస్వామి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం హార్టికల్చర్ ఎఒ తేజ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణీకి రక్తదానం

చీమకుర్తి : మర్రిపూడికి చెందిన కొండమ్మకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవరాజ్ రక్తదానం చేశారు. స్థానిక జవహర్ నర్సింగ్ హోమ్‌లో ఆపరేషన్‌కు రక్తం అవసరమైంది. భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ తరుపున గురువారం దేవరాజ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ అత్యవసరమైన సమయాలలో భగత్‌సింగ్ డోనర్స్‌క్లబ్ తరుపున రక్తదానం చేయడానికి, రక్తదానం చేయించడానికి ముందుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డోనర్స్‌క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మండల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రతి ఒక్కరూ మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన యర్రగొండపాలెంలోని మండల పరిషత్ సమావేశపు భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వాంతులు, విరేచనాలు, విష జ్వరాలు ప్రభలుతున్నాయన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. బాలకార్మికులను గుర్తించి వారికి హాస్టల్ వసతి కల్పించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నేరుగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రభుత్వం వ్యవసాయానికి సరఫరా చేస్తున్న తొమ్మిది గంటల విద్యుత్‌ను ఒకేసారి సరఫరా చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. గర్భిణీలు, చిన్నారులు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారిని ఎప్పటికప్పుడు చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నాగేశ్వర ప్రసాద్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైస్ ఎంపిపి ఆదిశేషు, డిప్యూటీ తహశిల్దార్ విజయ కుమార్, ఎంఈవోలు పి ఆంజనేయులు, మల్లూ నాయక్, ఈవోఆర్డీ దుల రాజశేఖర్‌రెడ్డి, ఏపీవోలు నాగేశ్వరరావు, శైలజ, సీడీపీవో ఎం పద్మజ, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డిచ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి ఏకుల జయమ్మ ముసలారెడ్డి, బోడా శ్రీశైలపతి నాయుడు, పంచాయతీ కార్యదర్శులు రమేష్‌రెడ్డి, ఎలకా శ్రీను, బి రామారావు నాయక్‌లతో పాటు ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్

ఎసి మాటలూ బేఖాతరు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

దేవదాయ దర్మదాయ శాఖ అసిస్టెంట్ కమీషనరు శ్రీనివాసరెడ్డి మాటలు ఉప్పుగుండూరు గ్రూపు దేవస్థానాల ఇఓ మీనిశెట్టి శ్రీనివాసరావు భేఖాతరు చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది వివరాల మేరకు ఉప్పుగుండూరు శివాలయం పూజారి రామకష్ణశర్మ గ్రామస్తులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తను చెప్పినట్లు వినాలి నేను చెప్పిన రేటుప్రకారం డబ్బులు చెల్లిస్తాను లేకుంటే పూజ చేయను అని చెప్పడంతో గ్రామస్తులు విస్తు పోయారు రేట్లు కూడ రూ.2వేలు నిర్ణయించి ఆ ప్రకారం చెల్లించాలని తెలపడంతో ఆదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఇటీవల ఓ మహిళ శివ పార్వతులకు పట్టువస్త్రాలు తీసుకు వెళ్ళగా అసభ్య పదజాలంతో మాట్లాడంతో ఆమహిళ మనస్థాపానికి గురైనంది ఆసంఘటన గ్రామస్తులకు తెలియడంతో దాంతో గ్రామస్తులు ఇటువంటి పూజారి మాకు వద్దని గ్రామస్తులంతా ఐక్యంగా సమావేశం నిర్వహించగా ఇఓ మీనిశెట్టి శ్రీనివాసరావు పూజారిని తొలగిస్తాను కొత్తపూజారిని ఏర్పాటు చేస్తాను హామీ ఇచ్చారు. దాంతో గ్రామస్తులే కొత్త పూజారిని ఏర్పాటు చేసుకున్నారు సమావేశం జరిగి నాలుగురోజులైంది కొత్తపూజారికి బుధవారం భాధ్యతలు అప్పచెప్పి సామానులు లెక్క చెబుతాను గ్రామస్తులను గుడివద్దకు రావాలని తెలిపారు. కాని గ్రామస్తులు వచ్చినప్పటికీ ఇఓ రాలేదు ఆవిషయం గురువారం అసిస్టెంట్ కమీషనరుకు తెలపగా వెంటనే స్పందించిన ఎసి శ్రీనివాసరెడ్డి చరవాణిలో ఇఓ మీనిశెట్టి శ్రీనివాసరావుకు పూజారిని తొలగించి కొత్తపూజారిని ఏర్పాటు చేయవు నిన్న గ్రామస్తులను రమ్మని ఎందుకు వెళ్ళలేదు అని ప్రశ్నించారు. గురువారం ఖచ్చితంగా గ్రామంలోకి వెళ్ళి గ్రామస్తులతో మాట్లాడి సమాచారం తెలపాలని ఆదేశించారు. అయినప్పటికీ ఏసి మాటలు కూడ భేఖాతరు చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే దేవస్దానం ముందు ఆందోళన చేస్తామన్నారు.

సింహ గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దూదేకుల హక్కులకై పోరాడాలని కోరుతూ ఈనెల 29న గుంటూరులో జరిగే సింహ గర్జన కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఖాసిం పీరా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని కటకానిపల్లెలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు శాతం ఉన్న దూదేకుల సామాజిక వర్గంలో చైతన్య పరిచే దిశగా ఈనెల 29న గుంటూరులో జరిగే సింహ గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పెద్ద మస్తాన్, నూర్ భాషా, అధికార ప్రతినిధి కమల్ భాయ్, నాగుల మీరా చిన్న కాశయ్య, నాసరయ్య పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

చలో హైదరాబాద్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-మార్కాపురం

ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు డిసెంబర్ 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభకు మాదిగలు లక్షలాదిగా తరలిరావాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్ ముఖ్య నేతలు కరపత్రాన్ని మార్కాపురంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు మాదిగ, ఎంఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు బొంత ఏసుదాసు మాదిగ, ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజాక్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా కోశాధికారి తేళ్ల జాలారావు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఆదిమూలపు ప్రకాష్‌మాదిగ, సీనియర్ నాయకులు పందీటి కాశీరావు మాదిగ, ఎంఇఎఫ్ డివిజన్ అధ్యక్షుడు శ్రీగిరి చిన్ని కుమార్, సంజీవ్, కిలారి ప్రసాద్, శ్రీగిరి సురేష్, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కులగణనతో సామాజిక విప్లవం తథ్యం : ఎంపిపి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కుల గణనతో సామాజిక విప్లవం తథ్యమని ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం ముదావహమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను రాజకీయంగా అందలం ఎక్కించిన ఘనతను దక్కించుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే బీసీ కులాల వారీగా జన గణన చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. నవంబర్ 15 నుంచి కులాల వారీగా జన గణన చేయాలని ఆదేశాల జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీల్లో విద్యా, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. రాజకీయ రిజర్వేషన్ కోసం కాదు, తమ పిల్లలు బాగుండాలనే కుల గణన కోరుతున్నామని అన్నారు. బీసీల్లో ఉపాధి కూలీలు అధికంగా ఉన్నారన్నారు.

దేశభక్తితో సమాజాభివృద్ధిలో ముందుండాలి

ప్రజాశక్తి-మార్కాపురం

జాతీయ గీతాలాపనలో భారతీయ పౌరులంతా బాధ్యతగా పాల్గొనాలని రెడ్డి సంక్షేమ సేవా సంఘం మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి కోరారు. తద్వారా దేశభక్తితో సమాజాభివృద్ధిలో యువత ముందుండాలని సూచించారు. మార్కాపురం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ వద్ద గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గత 30 రోజులుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. జాతీయ గీతాలాపన అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని జి ఉమ్మడివరం సచివాలయ పరిధిలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల మండలంలోని గుట్లపల్లి గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని గురువారం తిరిగి సచివాలయానికి స్కూటీపై వెళు న్న క్రమంలో ఆటో ఢీ కొంది. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు మండలంలోని మేడపి గ్రామస్తురాలుగా పోలీసులు గుర్తించారు. ఆమెకు ఇద్దరు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఎఎన్ఎం ప్రమీళ

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-రేపల్లె

గత నెల 28వ తేదీన అర్ధరాత్రి సమయములో రేపల్లె పట్టణములోని పెనుమూడి రోడ్ ఆర్చ్ వద్ద ఉన్న నబీసా సౌండ్స్ షాప్ ముందు పెట్టిన డీజే బాక్సులు, ఆమ్ప్లిఫయర్స్ సుమారు రూ.3,50,000/- విలువ గల వస్తువులను ఎవరో గుర్తు తెలియని దొంగలు దొంగలించినట్లుగా రేపల్లె 1వ వార్డ్ షేక్ నబీసా ఇచ్చిన రిపోర్ట్ మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ నజీర్ బేగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు లో బాగముగా రాబడిన సమాచారము మేరకు గురువారము వెల్లటూరు సెంటర్‌లో సిఐ నజీర్ బేగ్, వారి సిబ్బంది చీరాల మండలం ఈపురుపాలెం గ్రామానికి చెందిన నిందితుడు ఆరికాటి మహేష్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనపరుచుకున్నామని సీఐ తెలిపారు. ఈ కేసులో రెండవ ముద్దాయి సలగల సుదీర్ పరారీలో ఉన్నాడని త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. అరెస్ట్ అయిన ముద్దాయిని రిమాండ్ నిమిత్తము కోర్ట్‌లో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారన్నారు.



కల్తీ పాల తయారీదారుడ్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

కల్తీ పాల తయారీదారుడిపై దాడులు

ప్రజాశక్తి-దర్శి

స్థానిక పొదిలి రోడ్డులో గాంధీ నగర్ సమీపంలో ఓ పాలకేంద్రంలో కల్తీ జరుగుతున్నట్లు ఒంగోలు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేసి రెండు క్యాన్ల పాలల్లో కల్తీ ఉందని గుర్తించి నిర్వాహకుడిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఏఎస్పీ శ్రీహర్ష తెలిపారు. దర్శిలో అప్పుడప్పుడు పది చోట్ల కల్తీ వ్యాపారం జరుగుతుందని అందిన సమాచారంతో వచ్చి పక్కాగా పట్టుకుని పుల్లారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా ఇలాంటివి జరిగితే తమకు సమాచారం తెలపాలని కోరారు. కల్తీ పాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి వారిని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

ముగిసిన పిసిబి డిజైన్ వర్క్ షాప్

ప్రజాశక్తి-టంగుటూరు

ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యూవీ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ బి వెంకట సుమంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ ద్వితీయ సంవత్సర విద్యార్థుల పీసీబి డిజైన్ వర్క్ షాప్ ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిసిబి డిజైన్‌కు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జీవీకే మూర్తి, ట్రిపుల్ ఈ విభాగాధిపతి బి నాగరాజు, కళాశాల కోఆర్డినేటర్లు కె సౌజన్‌కుమార్, ఎం మల్లికార్జున్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ సమావేశంలో షాడోల హవా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక సంస్థల్లో భార్యలు ఎన్నికైతే భర్తలు పెత్తనం చేయడం సహజంగా చూస్తున్నాం. కానీ పంచాయతీ సమావేశాలలో కూడా మహిళా సభ్యులకు బదులు వారి భర్తలు సమావేశంలో కూర్చోవడమే కాక తీర్మానాలు, ఎజెండాలపై చర్చ చేస్తున్నారు. మహిళా ప్రతినిధులకు సమావేశంలో ఏది చర్చించాలో ముందుగా భర్తలు సూచన చేసుకుని సమావేశానికి పంపిస్తుంటారు. కానీ భట్టిప్రోలు పంచాయతీ సమావేశం అందుకు భిన్నంగా కొనసాగు తుంది. ఇక్కడ సర్పంచి విద్యావంతురాలే అయినప్పటికీ భర్త అన్నీ చక్కబెడుతుంటారు. సమావేశంలో కూడా స్వయంగా తానే పాల్గొన్నారు. విధివిధానాలను సర్పంచితో సంబంధం లేకుండా నిర్ణయాలు చేసేస్తున్నారు. అదే రీతిలో కొందరు పాలకవర్గ మహిళా సభ్యులకు బదులుగా భర్తలు సభ్యులుగా పాల్గొని అజెండాలోని అంశాలపై వాదోపవాదనలకు దిగుతూ అవసరమైన అంశాలను



పంచాయతీ సమావేశంలో భార్యల స్థానంలో భర్తలు

కూడా డీసెంట్ రాయిస్తూ ఉంటారు. గురువారం జరిగిన పంచాయతీ సమావేశంలో కొందరు మహిళా సభ్యులతో పాటు వారి భర్తలు కూడా పాల్గొన్నారు. మరికొంత మంది మహిళలకు బదులుగా భర్తలు మాత్రమే పాల్గొనడం చర్చ నీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న షాడో సభ్యులపై కనీసం సంబంధిత పంచాయతీ కార్యదర్శి కూడా పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు అనుమానా లు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి షాడో వ్యవస్థ వలన ఎదురవుతున్న ఇబ్బం దులపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగునీరు తోడెందుకు నాలుగు లక్షలా?

గ్రామంలోని 8, 9వార్డులలో మురుగును తొలగించేందుకు ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజన్లు, ప్రొక్లైనుకు రూ.3 నుండి రూ.4లక్షల వరకు వెచ్చించినట్లుగా కార్యదర్శి సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. దీనిపై పలువురు సభ్యులు అభ్యంతర వ్యక్తం చేశారు. ఎలాంటి తీర్మానం, ఆమోదం లేకుండా అంత ఖర్చు ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. పనులు జరిగే సమయంలో సంబంధిత అధికారులు లేకుండా కార్యదర్శి, కొందరు పాలకవర్గ సభ్యులు మాత్రమే ఏ విధంగా పనులు చేస్తారని ప్రశ్నించారు. ఇంత ఖర్చు చేసిన మురుగు సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - చీరాల

ఇసుక అక్రమ రవాణాకు కారణమైన అక్రమార్కులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, నాయకులు ఎన్ బాబురావు, పి కొండయ్య డిమాండ్ చేశారు. కావూరివారిపాలెం రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం కలెక్టర్ ఆదేశాలతో ఇసుక తవ్వకాలపై సర్వే చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అధికారుల సర్వేలో 5వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకున్న వ్యక్తులు ఒక లక్ష 20వేల క్యూబిక్ మీటర్లు తవ్వేశారని తేలిందని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గుంటలు పూడ్చాలని కోరారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అక్రమ తవ్వకాలు, రవాణాకు ఉపయోగించిన ప్రొక్లెయినర్లు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేయాలని కోరారు. అక్రమ తవ్వకాలు చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సరస్వతీదేవి విగ్రహానికి భూమిపూజ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట జెడ్‌పి హై స్కూల్, మండల పరిషత్ స్కూలు ఆవరణలో సరస్వతి దేవి విగ్రహం నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. పట్ట భద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు, ఎంఇఒ ఐ పురుషోత్తం, డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావ, నాసిక శివప్రసాద్, డాక్టర్ రవిబాబు, సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, సజ్జ శ్రీధర్ బాబు, నాగరాజు, శరత్ బాబు, నాగాంజ నేయులు, మస్తాన్ రెడ్డి, రామకృష్ణ హైస్కూల్ హెడ్మాస్టర్ విజయలక్ష్మి, హెచ్ఎం కె మల్లేశ్వరి, అధ్యాపకులు కె మాల్యాద్రి, డి గోపాలకృష్ణమూర్తి, ఉమ్మటి పార్వతి, బుచ్చ మ్మ, ఎం శైలజ, అశోక్ కుమార్, వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు హరిబాబు, లలిత పాల్గొన్నారు.



శంకుస్థాపనలో ఎంఇఒ



వర్క్‌షెడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ కరణం బలరాం

విద్యుత్ వర్క్‌షెడ్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - వేటపాలెం

వర్క్‌షెడ్ నిర్మాణంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తుకు సమయభావం కలిసి వస్తుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని దేశాయిపేట పంచాయతీ ఆయిల్ మిల్ పాత గేటు వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర వర్క్ షెడ్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చీరాల డిఈఈ కె జాని థామస్, చీరాల ఏడీ తోటకూర శ్రీనివాసులు, వేటపాలెం ఏడి కె శ్రీనివాసరావు, ఏఈలు భాస్కరరావు, వైసిపి మండలం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జెసిఎస్ ఇంచార్జీ లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, దంతం హనుమంతు, హాలీ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో చైతన్యవేదిక అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి

అభ్యుదయ భావాల ప్రచారం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

అభ్యుదయ విజ్ఞాన భావాలను ప్రచారం చేసేందుకు కార్యక్రమం తీసుకున్నట్లు ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోటా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జెవివి, కెవిఆర్ అభ్యుదయ భావాల వేదిక, రూన్సీరాణి కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వెదుళ్ళపల్లి చైతన్య భవన్‌లో గురువారం జరిగిన వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. అమలాపురం వెంకటేశ్వరరావు, ఎన్‌కె సుభాని, భారతి, ఆర్జా గజేంద్రరావు, వెంకటేశ్వర్లు, కెవి నారాయణ, సౌజన్య, లోకేష్, చిన్నబాబు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం కోసమే 'జగనన్న సురక్ష'



సురక్ష వైద్యశిబిరంలో ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

ప్రజాశక్తి - నగరం

ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలనే ధ్యేయంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష ప్రవేశ పెట్టారని ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. మండలం లోని ఈదుపల్లి గ్రామంలో జగనన్న సురక్ష వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ చింతల పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చినమట్లపూడి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ తులసీ రాజేశ్వరి, దూళిపూడి పిహెచ్సి వైద్యాధికారి భవన్శ్రీ, ఎంపిడిఒ చక్రపణిప్రసాద్, తాడివాకవారిపాలెం సర్పంచ్ టి అనీల్ కుమార్, చింతల సుబ్బారావు, మాజీ ఎంపిపి వాసుదేవరావు, అంగనవాడి సిబ్బంది ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సంతమాగులూరు : పేదల ఆరోగ్యం, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పరిపాలన సాగుతుందని శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి ఇంచార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని మక్కెనవారిపాలెం సచివాలయ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు మందులు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ బొల్లినేని రామకృష్ణ, గద్దల రాజకుమార్, సర్పంచి ధూపాటి ఉషారాణి, ఇప్పల మునలారెడ్డి, టి వెంకట్రావు పాల్గొన్నారు.

కొల్లూరు : మండలంలోని రావికంపాడు సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత శిబిరం నిర్వహించారు. శిబిరంలో 566మంది నమోదు చేసుకున్నారు. 296మంది స్త్రీలు, 263మంది పురుషులు, ముగ్గురు గర్భిణీ స్త్రీలు, ఏడుగురు స్కూలు పిల్లలు, 99మంది ఐ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. కంటి వెలుగు కింద 50మందికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, వైసిపి నాయకులు ఉప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పర్చూరులో గురువారం నిర్వహించారు. 402మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవంతి, అనిత, అనీల్, జి రామకృష్ణ, నాగరాజు, ఎంపిడిఓ వి ప్రద్యుమ్నకుమార్, ఎంఇఒ వెంకటరామయ్య, సర్పంచ్ మల్లా అంజమ్మ, వైస్ ఎంపిపి కోట లక్ష్మీ ప్రసన్న, కో ఆప్షన్ సభ్యులు కాలేషావలి, గ్రామ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ ఆలీ పాల్గొన్నారు.

వేటపాలెం : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు అన్నారు. మండలంలోని దేశాయిపేట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజా దెబోరా, ఎంపీడీఓ రుతమ్మ, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జేసిఎస్ ఇంచార్జీ లేళ్ల శ్రీధర్, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, దంతం హనుమంతు, కర్ర లక్ష్మ, ఖాదర్, పృథ్వి చంద్రమోహన్, కర్ర ప్రసాద్ పాల్గొన్నారు.



సురక్ష వైద్య కిట్లు అందజేస్తున్న అద్దంకి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

డాక్టర్ కాదనే ప్రచారం అవాస్తవం

ఐ కాన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కొండలరావు

ప్రజాశక్తి - చీరాల

ఆయన వైద్యుడు కాదు కాంపౌండర్ అని, జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలకు ఎలా వైద్య సేవలు అంది స్తారని, పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వ్యక్తి ప్రశ్నించటంతో విషయం వెలుగులోకి వచ్చిందంటూ తమ డాక్టర్ ఫణిపై సోషల్ మీడియాలో వచ్చిన అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మవద్దని ఐకాన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎస్ కొండలరావు అన్నారు. స్థానిక ఐకాన్ హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ హాస్పటల్‌లో డ్యూటీ డాక్టర్‌గా గత ఐదు సంవత్సరాలుగా డాక్టర్ ఫణి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆయన చైనాలో ఎంబిబిఎస్ పూర్తిచేసి ప్రస్తుతం తమ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. సురక్షప్రభుత్వ కార్యక్రమానికి ప్రవేటు డాక్టర్లను కూడా ఆహ్వానించడంతో తాను వెళ్లే క్రమంలో ఏముకల వైద్య నిపుణులు డాక్టర్ కొండలరావు అని తన పేరుకు బదులుగా ఫణి పేరును కంప్యూటర్ ఆపరేటర్ పొరపాటున ప్రింటింగ్ తప్పుగా చేశారని అన్నారు. వైద్యుడిని కాంపౌండర్‌తో పోలుస్తూ దుష్ప్రచారం చేయటం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణి తన ఎంబిబిఎస్ ధ్రువీకరణ పత్రాలను మీడియాకు చూపించారు. తాను ఎముకల వైద్యుడనని ఎవరి వద్ద చెప్పలేదని అన్నారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పినట్లు తెలిపారు. తమపై గతంలోనూ సోషల్ మీడియా దుష్ప్రచారాలు చేశారని ఆరోపించారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేయవద్దని కోరారు. అసత్య ఆరోపణలను మానుకోవాలని పేర్కొన్నారు.



విలేకర్ల సమావేశంలో డాక్టర్ కొండలరావు

తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - వేటపాలెం

జగనన్న కాలనీలో శాశ్వత ప్రాతిపదికన ఇంటింటికి మంచినీటి కులాయి ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని చల్లారెడ్డి పాలెం పంచాయితీ చేనేతపురి కాలనీ నందు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. చేనేతపురి జగనన్న హౌసింగ్ కాలనీ నందు రూ.82.30లక్షల జల జీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కోటేశ్వరావు అనే దివ్యాంగుడు తన ట్రై సైకిల్ దెబ్బతినిపోయిందని నూతన ట్రై సైకిల్ ఇప్పించాలని కోరారు. స్థానిక సమస్యల పట్ల పంచాయతీ కార్యదర్శి శివలీలను నోట్ చేసుకొని ప్రతిపాదన పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ శరత్చంద్ర, పంచాయతీరాజ్ డిఇ శేషయ్య, ఏఈలు రామ్‌కుమార్, సుబ్బారావు, ఎంపీడీఓ రుతమ్మ, ఎంవిఎస్ శర్మ, లైలా శ్రీధర్, బొడ్డు సుబ్బారావు, దంతం హనుమంతరావు పాల్గొన్నారు.



పైలాన్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ బలరాం

ప్రజలంతా ఐక్యంగా ఉండాలి : విజయ్‌కుమార్

ప్రజాశక్తి - మేదరమెట్ల

ప్రజలంతా ఐక్యంగా ఉంటే పరిపాలన హక్కుల సంక్రమిస్తాయని రిటైర్డ్ కలెక్టర్ జివిఆర్‌కెఆర్ విజయకుమార్ అన్నారు. ఇది తెలుసుకోలేకే ఆ రెండు వర్గాలకు చెందిన నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతున్నామని అన్నారు. ఐక్యత విజయ పదం పాదయాత్రలో భాగంగా బలరామకృష్ణపురం నుండి బయలుదేరి బొద్దువానిపాలెం గ్రామం మీదుగా మేదరమెట్ల చేరుకుని సెంటర్‌కు చేరుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, దామవరపు హరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ కలెక్టర్ విజయ్‌కుమార్

రాక్షస పాలనను తరిమికొట్టండి

తెలుగుదేశం పార్టీతోనే సమగ్రాభివృద్ధి ● ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య ● పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి

ప్రశాంతతకు మారుపేరైన ఏపిలో వైసిపి అధికారంలోకి వచ్చి ప్రజలను రాక్షసుల్లా పీడిస్తూ అభివృద్ధికి ఆనకట్టలు కట్టి అవినీతిని పారిస్తున్నారని, ఇలాంటి పాలనను రాష్ట్రం నుంచి తరమికొట్టాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. గురువారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో తెలుగుదేశం పార్టీ పాదయాత్రను చేపట్టింది. ఈ పాదయాత్ర కొండపి మండలం ముప్పవరం గ్రామంలోని అంకమ్మ తల్లి ఆలయం నుంచి గోగినేని వారిపాలెం గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు నిర్వహించారు. రెండు గ్రామాలలో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో అభివృద్ధిని అంతమొందించడమే లక్ష్యంగా వైసిపి నేతలు పాలించారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రజలకు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తామని, రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి రామయ్యచౌదరి, రాష్ట్ర నాయకులు వసంత రాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బి యలమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల నాయకులతోపాటు నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

శింగరాయకొండ: శింగరాయకొండలో 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, దామచర్ల సత్య ఆదేశాల మేరకు శింగరాయకొండ యూనిట్ నంబర్ 48లో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు గురించి వివరిస్తూ వారి నుంచి 9261292612 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో సుదర్శి ప్రసాదరావు, కోటా శ్రీనివాసరావు, మల్లెబోయిన భాస్కర్, చీమకుర్తి కమలాకర్, పండు మధు తదితరులు పాల్గొన్నారు.



శింగరాయకొండలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మద్దిపాడు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండల పరిధిలోని వెల్లంపల్లిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్‌బాబు మెడికల్ క్యాంప్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, స్థానిక సర్పంచ్, తహాశీల్దార్ రజనీ కుమారి, ఎంపీడీఒ శ్రీనివాసరావు, స్పెషల్ డాక్టర్స్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దరిశి: మండలంలోని తూర్పువీరాయపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఈవోఆర్డీ శోభన్‌బాబు, వైద్యులు కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న పాల్గొని జగనన్న సురక్ష నిర్వహించారు.



వెల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్

ఈ కార్యక్రమంలో నాయకులు ముప్పరాజు శ్రీను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి మండలం బొమ్మిరెడ్డిపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం జరుగగా ముఖ్య అతిథిగా కనిగిరి జడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ లోకిరెడ్డి రమణమ్మ, మాజీ సర్పంచ్ లోకిరెడ్డి అంకిరెడ్డి, వైసిపి నాయకులు సంగటి మహేంద్రరెడ్డి, కోటి యాదవ్, శ్రీహరిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తురిమెళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం మండలం తురిమెల్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన 32/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్ ను గిద్దలూరు శాసన సభ్యులు అన్నా రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా నూతన సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ తురిమెళ్ల, మదారుపల్లి, నర్సిరెడ్డిపల్లి, గ్రామాల ప్రజలకు తురిమెళ్ల సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యలు తొలగిపోతాయన్నారు. ముందుగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యే అన్నాను ఘనంగా సన్మానించి ఆహ్వానించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌కు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, పలువురు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

ట్రైబల్ వెల్ఫేర్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభంలోని వైద్య విధాన పరిషత్ వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన ట్రైబల్ వెల్ఫేర్ హాస్పిటల్‌ను గురువారం ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివ నాయక్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమించిన భూమిలో హద్దురాళ్ల తొలగింపు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేసుకున్న భూమిలో హద్దురాళ్లను అధికారుల పర్యవేక్షణలో గ్రామస్తులు తొలగించారు. మండలంలోని నల్లమడుగుల రెవెన్యూలో 220/1లో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని హద్దురాళ్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో అజయ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఆక్రమణ భూమిని పరిశీలించి ఫెన్సింగ్ రాళ్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆక్రమణదారుడికి సూచించారు. అయినా ఫెన్సింగ్ రాళ్లను తొలగించకపోవడంతో తహశీల్దారు షేక్ నాగుల్ మీరా ఉత్తర్వులతో ఆర్ఐ శ్రీధర్‌బాబు, వీఆర్వో సుధాకర్‌ల పర్యవేక్షణలో గ్రామస్తులు గురువారం యంత్రాల ఏర్పాటు ద్వారా ఆక్రమణ భూమిలోని ఫెన్సింగ్‌ను, హద్దురాళ్లను తొలగించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

న్యాయం చేయాలని మహిళ వేడుకోలు

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్లో నివాసం ఉంటున్న షేక్ ఖాసింబి తన ఇంటికి దారి లేకుండా ఇరువైపులా అడ్డుగా రాళ్లు వేశారని, తమ ఇంటిని ఆక్రమించుకునేందుకు దాడి చేస్తున్నారని రక్షణ కల్పించి న్యాయం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసీ కేశవరావు ఆధ్వర్యంలో ఆర్డీవో అజయ్ కుమార్‌కు వినతిపత్రం బుధవారం అందజేసిన విషయం విదితమే. ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, సచివాలయ అధికారులు సిబ్బంది గురువారం సంఘటనా స్థలానికి చేరుకొని దారికి అడ్డంగా ఉన్న రాళ్ల తొలగింపు చర్యలు చేపట్టారు. దారి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎదురుగా ఉన్న ఫౌండేషన్ నిర్మాణం తొలగించాలని, మౌలిక వసతులు కల్పించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసీ కేశవరావు, బాధితురాలు కాసింబి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్‌కె బషీరా, ప్రసన్న, ఏడుకొండలు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సెటిల్మెంట్ భూముల స్వాహాకు యత్నం

న్యాయం చేయాలని విన్నపం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్: పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన సెటిల్మెంట్ భూములను కొద్దిమంది స్వాహా చేయాలని చూస్తున్నారని, తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామానికి చెందిన కొద్దిమంది ఎస్సీలు తహశీల్దారు నాగుల మీరాను కోరారు. గుంతచెన్నంపల్లి గ్రామానికి చెందిన సగిలి చిట్టిబాబు, లక్కిపోగు ఏసురత్నం, చల్లగాలి వెంకటయ్య పలువురు గ్రామస్తులు గురువారం తహశీల్దారు షేక్ నాగుల్ మీరాను కలిశారు. గుంతచెన్నంపల్లి రెవెన్యూలో 234/2 సర్వే నెంబర్‌లో పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన సెటిల్మెంట్ భూములు ఉన్నాయని, ఆ భూమిలో 2014లో యూకలిప్టస్ మొక్కలు కూడా నాటామని అయితే గ్రామానికి చెందిన కొద్దిమంది నాయకులు ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారస్తులతో కలిసి మా భూములను స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆ భూమిని కౌలుకు తీసుకుంటున్నట్లుగా నిరాక్షరాశ్యులయిన మా పెద్దలను నమ్మించి వారి నుంచి సంతకాలు సేకరించి తమ పెద్దవారి నుంచి భూములను కొనుగోలు చేసినట్లుగా చెబుతూ తమ భూములు స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూములు కాపాడి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దారు నాగుల్‌మీరాకు వినతిపత్రం అందజేశారు.

తాళ్లూరు ఎస్ఐగా వైవీ రమణయ్య

ప్రజాశక్తి-దర్శి



తాళ్లూరు ఎస్ఐగా వైవీ రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అక్కడ పనిచేసిన ప్రేమ్ కుమార్ ఒంగోలు వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో కొండపి నుంచి వైవీ రమణయ్య గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో దర్శిలోని పొట్టి శ్రీరాములు వీధికి చెందిన షన్ము జ్యూలరీ షాపు యజమాని పత్తిపాటి లోకేష్ ఆచారి, ధరణిజ గార్ల పుత్రిక హిమజ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. అన్నదానం చేయడం వల్ల ఆత్మ సంతృప్తి లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

ప్రజాశక్తి-దర్శి

జగనన్న సురక్ష కార్యక్రమంలో తాళ్లూరు మండలం తూర్పుగంగవరం ప్రాథమిక వైద్యశాల పరిధిలో ఇటీవల కాలంలో గుర్తించిన వారిని గుంటూరు జిల్లా పెద్దకాకాని శంకర కంటి ఆసుపత్రికి డాక్టర్ రత్నం తరలించారు. మొత్తం 48మంది తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా రుణసదుపాయం

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వం మహిళా రైతుల కోసం సాగు ఖర్చులకు సంఘాల ద్వారా రుణ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తాళ్లూరు మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మహిళా రైతుల కోసం తాళ్లూరులో 146 గ్రూపులు ఉండగా గత పది నెలలుగా పొదుపులు నిర్వహించిన వారికి సాగు ఖర్చుల కింద రుణాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దేవరాజు, రైతులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండలోని శ్రీవరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు హుండీ ఆదాయం రూ.3,43,102 వచ్చిందని చైర్మన్ పామర్తి మాధవరావు, కార్యనిర్వాహణ అధికారి పి కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహచార్యులు తెలిపారు.

వృద్ధులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-దొనకొండ

మండలంలోని రామిరెడ్డిపల్లి, కందులవారిపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వృద్ధ నిరాశ్రయులకు రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఒకొక్కరికి రూ.2 వేలు చొప్పున నగదును గురువారం అందజేశారు. రెడ్డి కమ్యూనిటీ సొసైటీ గౌరవ అధ్యక్షుడు రామ్‌భూపాల్‌రెడ్డి స్వయంగా ఆయా గ్రామాలకు వచ్చి నగదు, స్వీట్లు, పండ్లు అందజేశారు. దాతలు దాతృత్వంతో పేద వృద్ధ నిరాశ్రయులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు టి స్వాతి, మండల కన్వీనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బొబ్బూరి శ్రీను అకాల మరణం బాధాకారం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్‌పురం గ్రామానికి చెందిన బొబ్బూరి శ్రీనివాసులు అకాల మరణం చాలా బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అన్నారు. శ్రీను తనకు చాలా సుపరిచితుడని, తన వెన్నంటి ఉండేవాడని, అలాంటి వ్యక్తి మరణం తనకు దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల టిడిపి అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, శ్రీను మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిఎస్‌పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, శ్రీను మృతి చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి

వెంకటరావుకు నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన పోతినేని వెంకటరావు దశదిన కర్మ కార్యక్రమంలో కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పాల్గొని వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంభ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకులు రావిపాటి బాలకృష్ణ, రాఘవ, రావెళ్ల రమేష్, ఏజండ్ల రవీంద్ర మండలంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

22న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు పోలీస్ స్టేషన్‌లో అక్టోబర్ 22వ తేది ఆదివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లుగా గిద్దలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవ ప్రభాకర్ తెలిపారు. గిద్దలూరు, కొమరోలు, రాచర్ల పోలీసు సిబ్బంది రక్తదానం చేస్తారని, ఎన్జీవోస్, యువకులు కూడా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని సీఐ దేవ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఐ ఉపేంద్రరావు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సాధారణ తనిఖీలలో భాగంగా గురువారం జిల్లా రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేషన్ శాఖ అధికారి ఉపేంద్రరావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కక్షిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపేంద్రరావు మాట్లాడుతూ యర్రగొండపాలెంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎటువంటి సమస్యలు లేవన్నారు. రిజిస్టర్ చేయించుకున్న వారితో కూడా మాట్లాడామన్నారు. రిజిస్టర్ చేయించుకునే వారితో సిబ్బంది గౌరవంగా మాట్లాడాలన్నారు. రిజిస్టర్ చేయించుకునే వారు దస్తావేజు లేఖరుల బారిన పడకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి మాట్లాడుకోవాలన్నారు. బ్రోకర్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. ప్రభుత్వం నిబంధనల మేరకు చార్జీలు చెల్లించి రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. అయన పాటు సబ్ రిజిస్టర్ అధికారి జ్ఞాన సుందర్ రావు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామాభివృద్ధి మన చేతిలోనే

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని కేతగుడిపి పంచాయతీ పరిధిలో స్థానిక సచివాలయం దగ్గర రిలయన్స్ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ ఉమాదేవి ఎఫర్ట్ సంస్థ సంయుక్తంగా గ్రామ అభివద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేతకుడు సర్పంచి డి.పెద్దమస్తాన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం అభివద్ధి చెందాలంటే అది మన చేతుల్లోనే ఉందని గ్రామంలోని ప్రతి ఒక్క రైతు ఆర్టికల్ 73లో భాగంగా కొన్ని ముఖ్యమైన అంశాలను పొందుపరచడం జరిగిందని, వాటిలో కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్క రైతు సేంద్రియ పద్ధతులను వ్యవసాయం చేయాలని, సూచించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ పి.గోపికష్ణ, రైతులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష... ప్రజల ఆరోగ్యానికి రక్ష...

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్ అన్నారు. మండలంలోని గురిజేపల్లిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సాయికుమార్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి నాణ్యమైన వైద్య సేవలు అందించమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. మారుమూల అటవీ గ్రామాల్లో సైతం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలను ఆరోగ్య వంతులుగా చేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. వృద్ధులకు కంటి వెలుగు పథకం ద్వారా కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ జబివుల్లా, వైసీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి రాములు, సర్పంచ్ ఫిలిప్స్, వైసీపీ నాయకులు షేక్ వలి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సూర్య ప్రకాష్, డాక్టర్ సుదర్శన్ బ్రహ్మతేజ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమావతి, వైద్య, ఆశా, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** మండలంలోని రామచంద్రకోట గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంటి వద్దకే వచ్చి వైద్య చికిత్సలు అందిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ వేణుగోపాల్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ, డాక్టర్ సాయి ప్రశాంతి, డాక్టర్ ఆంజనేయులు, వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచ్ యోబు, ఏవో ప్రసన్న దేవి, వైసీపీ నాయకులు గుమ్మా యల్లేష్ యాదవ్, వెన్నా వెంకిరెడ్డి, సచివాలయ కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొండపి :** ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ వరమని పెట్లూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి.అనూషా అన్నారు. గురువారం మండలంలోని చిన్నకండ్లగుంట సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సిఎం ద్వేయమని, ప్రతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్యాంపులో 347 మందికి పరీక్షలు చేసి మందులు అందచేయడం జరిగింది. అందులో 17 మందిని ఆసుపత్రికి మెరుగైన వైద్యం కొసం పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్‌కె వన్నూరు , డాక్టర్లు ఐ.ప్రియాంక, స్పెషలిస్టు


వైపాలెంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

డాక్టర్లు కీర్తి, నిఖల్ దీప్తి, లీనా రిఫల్, వైద్య సిబ్బంది, ఆశవర్కుల్లు, ఏఎన్‌యంలు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది , గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **చీమకుర్తి :** జగనన్న సురక్ష ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని కెవిపాలెంలో మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వై వసంతరావు, వై మోహన్, ఎంపిటిసి వేమా అశ్విని, పేరయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** శింగరాయకొండ మండలం కలిగివాయి గ్రామంలో గురువారం నాడు జగనన్న ఆరోగ్య సురక్ష



కొండెపిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చిడిపోతు వెంకటరత్నం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఎండిఓ జమీ ఉల్ల, జిల్లా అదనపు వైద్యాధికారి వాణిశ్రీ హాజరై జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం ఆయుష్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పని తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గ్రామాలకు వచ్చినప్పుడు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఎప్పటికప్పుడు రికార్డులను చూస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జేసిఎస్ మండల కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, గౌరవరపు నాగేశ్వర్‌రెడ్డి, కష్టారెడ్డి, వైద్య బందం తదితరులు ఉన్నారు. **పుల్లలచెరువు :** మండలంలోని యంద్రపల్లి గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ఇంటి వద్దకే వచ్చి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ బివి సుబ్బారెడ్డి, జడ్పిటిసి వాగ్యా నాయక్, డిఎల్‌డివో సాయి కుమార్, తహశిల్దార్ దాసు, ఎంపిడివో మరియదాసు, పంచాయితీ కార్యదర్శి నలగాటి ఆత్మానంద సత్యనారాయణ నాయుడు, వైద్య, అంగన్‌వాడీ, ఆశా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **టంగుటూరు :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ పి రత్నజ్యోతి, జే సీ ఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రత్నజ్యోతి తదితరులు ఆరోగ్య సురక్ష లో ఏర్పాటు చేసిన అన్ని వైద్య పరీక్షల విభాగాలను పరిశీలించారు. వైద్య శిబిరంలో మొత్తం 517 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి రత్నజ్యోతి, చింతపల్లి హరిబాబు లతో పాటు గ్రామ సర్పంచ్ బిళ్లా ఝాన్సీ రాణి, పిహెచ్ సీ వైద్యాధికారులు డాక్టర్ జి బాలాజీ అశోక్, డాక్టర్ దివ్యశ్రీ, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ప్రదీప్ కుమార్, గౌతమి, ఐసీడీఎస్ సిడిపిఓ సిహెచ్ మల్లేశ్వరి, పీహెచ్ సి సిహెచ్‌ఓ డి మాతయ్య, అంగన్ వాడి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మండలంలోనీ ఉప్పుగుండూరులో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జడ్‌పిటిసి డాక్టర్ యాదల రత్నభారతి పర్యవేక్షించారు. ఉచిత వైద్యం కోసం క్యాంపుకు వచ్చిన రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వారికి డాక్టర్ల పర్యవేక్షణలో వైద్య సలహాలు అందించారు ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని ఆమె తెలిపారు అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డి జయమణి, తహశీల్దార్ సుజన్‌కుమార్, మద్దిసాని నాగేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతమవ్వాలి : టిడిపి

ప్రజాశక్తి-మార్కాపురం

మాజీ ఎంసి చంద్రబాబును కుట్ర పూరితంగా వైసిపి నేతలు అరెస్ట్ చేయించారని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు ఆరోపించారు. బాబుతో నేను సైతం అంటూ... టిడిపి చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమం మార్కాపురం మున్సిపాలిటీలోని 7వ వార్డులో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు చంద్రబాబు అరెస్ట్ జరిగిన తీరును వివరిస్తూ ముందుకు సాగారు. టిడిపి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కాపురం పట్టణ టిడిపి అధ్యక్షుడు షేక్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలు తమ ఆస్తులను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని టిడిపి


ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టిడిపి నేతలు

నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆరోపించారు. గురువారం మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో మేము సైతం అంటూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచి పెట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ అభివద్ధి అనేది లేకుండా ప్రతిపక్షాలపై కక్షసాధింపులతోనే సరి పుచ్చుకురన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై తప్పుడు కేసు పెట్టారన్నారు. యువత తమ భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చెవుల అంజయ్య, మంత్రూ నాయక్, వెంకటేశ్వర్లు, చెన్న వీరయ్య, వెంగళరెడ్డి, శ్రీశైలపతి నాయుడు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా గిద్దలూరు పట్టణం ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ప్రాక్టికల్ ఫీజు రూ.500 ఉంటే, కొన్ని కాలేజీలు రూ.3500 మరికొన్ని కాలేజీలు రూ.3500 విద్యార్థుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ గిద్దలూరు పట్టణ అధ్యక్ష, కార్యద ర్శిలు టి నారాయణ, డి జీవన్ కుమారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలు లేకపోవడంతో ప్రైవేటు కాలేజీ యజమాన్యం విద్యార్థుల దగ్గర నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్ కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీలపై ఇంటర్ బోర్డు ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, అన్ని ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీలు రికార్డు, ప్రాక్టికల్స్ ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టాలని డిమాండ్ చేశారు.

మినుము పంటలో తామర తెగులు

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మండలంలోని తంబళ్లపల్లె గ్రామంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి వై విజయభాస్కర్ రెడ్డి మినుము పంటను క్షేత్ర పరిశీలన గావించారు. ఏడిఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలో 600 ఎకరాల్లో మినుము పంట సాగులో ఉన్నట్లు, మినుము పంటలో త్రిప్స్(తామర పురుగు)ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆకులలోని రసం పీల్చడంతో ఆకులు కూచించుకొని పోయి ముడుచుకకుపోతున్నయని, నివారణ చర్యగా పిప్రోనిల్ 600 మిల్లి/ఎకరాకు 600మిల్లీ లీటర్ల పిప్రొనిల్ ద్రావకం పిచికారీ చేసి ఆకుముడత అరికట్టవచ్చని తెలిపారు. పంట బెట్టను తట్టుకొనుటకు ఎకరాకు ఒక కిలో 13.0.45 మల్టీకే పిచికారీ చేయాలని రైతులకు చూచించారు.

అర్చకుల వేతనాల పెంపు పట్ల హర్షం

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలోని 1167 దేవాలయాల్లో పని చేస్తున్న అర్చకుల కనీస వేతనం రూ.15,625 లకు పెంచేలా చర్యలు తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కార్యనిర్వహణ కార్యదర్శి రెటచింతల మధుసూదన్‌శర్మ గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సిఎం జగన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సైకిల్ యాత్రతో గొట్టిపాటి నిరసన


సైకిల్ యాత్రలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రజలను కోరారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయన చేపట్టిన సైకిల్ యాత్ర 12వ రోజుకు చేరింది. మండలంలోని సజ్జాపురం, కొప్పరం, బండివారిపాలెం మీదుగా ఫత్తేపురం వరకు 10కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశారు. మండలంలో రైతాంగం చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా ఉండటం లేదన్నారు. సాగర్ నీరూ అందడంలేదన్నారు. దీంతో త్రాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇంళ్లకు కరెంటు చార్జీలు ఏడు నుండి ఎనిమిది సార్లు పెంచారని అన్నారు. గతంలో చంద్రబాబు ముందు చూపుతో విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి దేశంలో నెంబర్ వన్‌గా మిగులు విద్యుత్ తీసుక వచ్చారని అన్నారు. మనం వాడుకోగా ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇచ్చామని అన్నారు. ఇవాళ కరెంటును రూ.18లకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యకు విద్యార్థులకు రూ.10లక్షల నుండి రూ.15లక్షల వరకు అందజేశామని అన్నారు. రాజ్యాంగ సృష్టికర్త అయిన అంబేద్కర్ పేరుపై విదేశీ విద్య పథకాన్ని అమలు చేశామన్నారు. దానిని రద్దు చేసి జగన్ పేరు పెట్టుకుని అంబేద్కర్‌ను అవమానించార ని అన్నారు. ఇవాళ విదేశీ విద్యకు పోయేవారికి రూపాయి కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదని ఆరోపించారు. 99శాతం హామీలు నెరవేర్చానని జగన్ అబద్ధపు మాటలు నమ్మవద్ద ని కోరారు. దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. రాబోయే రోజుల్లో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనా శనం చేస్తాడని అన్నారు. ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల ని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తెల్లప్రోలు రమేష్, ఏసోబు, కోటేశ్వరరావు, చేవూరి వాసురెడ్డి, శ్రీనివాసరావు, కంచేటి మురళి, అనంతవరపు దేవా, షేక్ సుభాని, వెంకటరావు, సురేష్, శ్రీనివాసరావు, సన్నెబోయిన ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులకు కష్టాలు

- నీటి కొరత కూడా అందుకే..
- ఎమ్మెల్యే ఏలూరి ఆరోపణలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రభుత్వ అసమర్థత వల్ల సాగునీరు సకాలంలో అందక పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. వైసిపి ప్రభుత్వానికి ముందు చూపు లేని కారణంగానే నీటి సంక్షోభం ఏర్పడిందన్నారు. నాడు వృథా అని విమర్శించిన పట్టిసీమే నేడు దిక్కయిందని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఎంతో ముందుచూపుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మి ంచిన పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా, గోదావరి నదులను అనుసంధానం చేసి కృష్ణా డెల్టాలో 12.5లక్షల ఎకరాల ఆయకట్టును సస్యశామలం చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. కృష్ణా నదిలో తగినంత నీరు లేదని తెలిసినా సీఎం వైఎస్ జగన్ ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచే పట్టిసీమ నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి ప్రణాళిక బద్ధంగా కాలువలకు నీటిని విడుదల చేసి ఉంటే ప్రస్తుతం ఈ దుస్థితి వచ్చేది కాదని అన్నారు. కొమ్మమూరు కెనాల్ కింద 2.63లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా మొత్తం కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.71లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని అన్నారు. కొమ్మమూరు కెనాల్ పూర్తి ప్రవాహ నీటి సామర్థ్యం 3,500 క్యూసెక్కులని తెలిపారు. ఈ సీజన్లో ఏ ఒక్కరోజు కూడా పూర్తి సామర్థ్యంతో నీరు విడుదల చేయ లేదని అన్నారు. వెయ్యి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు ఇస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. అక్టోబరు 3వారంలో కూడా చివరి ఆయకట్టు ప్రాంతమైన పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో వరి నాట్లు ఇంకా పూర్తిగా వేయలేదని అన్నారు. వరిసాగు చేసిన లక్షల ఎకరాలుకి సాగునీరు అందక కళ్ళముందే ఎండిపో తుంటే రైతు కన్నీరు పెడు తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లగా సాగు నీటి కాలువలను పట్టించుకోకపోగా కనీస మరమ్మతులు కూడా చేయలేదన్నారు. దీంతో కాలువలన్నీ అధ్వానంగా మారాయన్నారు. వర్షాభావ పరిస్థితులతో పర్చూరు, అద్దంకి రైతులు పంటలు సాగు చేయలేక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరువు మండలాలుగా ప్రకటించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు అన్నదాతలకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు వలసపోకుండా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాల ఉత్పత్తిపై ప్రభావం పడకుండా పశువులకు గ్రాసం ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతు ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.


ఎంఎల్ఎ ఏలూరి

టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

చంద్రబాబు అరెస్టుపై వాస్తవాలు ప్రజలు గమనిస్తున్నారని టిడిపి ఇన్చార్జి ఎం ఎం కొండయ్య అన్నారు. మండలంలోని దేశాలపేట రామనగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాతాని ఉమామహేశ్వరరావు, షేక్ యాసిన్, నిమ్మని వెంకట పిచ్చయ్య, నాసిక వీరభద్రయ్య, కౌతరపు జనార్ధనరావు, ఉసురుపాటి సురేష్, గజవల్లి శ్రీనివాసరావు, కొండ్రు రత్నబాబు, గుత్తి వీరప్రసాద్, పిచ్చుక వెంకట సుబ్బారావు, గుంటూరు ఉమామహేశ్వరరావు, పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, నరాల తిరుపతి రాయుడు, సత్యం, ఉమ్మిటి పద్మ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూర్‌బాషా నేతలు

29న దూదేకుల గర్జన

ప్రజాశక్తి - బాపట్ల

నూర్ భాషా దూదేకుల ముస్లిం హక్కుల సాధన కోసం ఈ నెల 29న గుంటూరు ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో నూర్ భాషా సింహ గర్జన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నూర్ భాషా సంఘం ఉపాధ్యక్షులు షేక్ ఫరీద్ తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో గురువారం జిల్లా నూర్ భాషా సంఘం ఆధ్వర్యంలో సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫరీద్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నూర్ భాషా ముస్లిం దూదేకుల సామాజిక వర్గానికి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తారో ఆయా రాజకీయ పార్టీలకే తమ పూర్తి మద్దతు ప్రకటిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నూర్ భాషా దూదేకుల ముస్లిం వర్గాల ప్రజలను జాగృతం చేందుకు బాపట్ల నుండే శ్రీకారం చుడతామని అన్నారు. కార్యక్రమంలో నూర్ భాషా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ వలి, విశ్రాంత తహసీల్దారు సిద్దయ్య, ఎన్ సుభాని, కోశాధికారి మీరావలి, డెకరేషన్ ఖాసిం, మస్తాన్ వలి, సుభాని, నాగుర్ వలి, బాజీ, బాబావలి పాల్గొన్నారు.

జగనన్న కాలనీని ప్రారంభించిన మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

నవరత్నాలు – పేదలందరికి ఇళ్ళు పథకంలో భాగంగా సామాన్యుల సొంతింటి కలలను సిఎం జగన్మోహన్ రెడ్డి సాకారం చేశారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావు అన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీలో నిర్మించిన 134 గృహాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ విఠర్శో సంస్థ సహకారంతో 134ఇళ్ళను గేటెడ్ కమ్యూనిటీ తరహాలో 11నెలల కాలంలో నిర్మించామని అన్నారు. తాను రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుండి అనేక సందర్భాలలో పేదలకు ఇల్లు నిర్మించాలని గుర్తుచేశారు. 2005సునామి సందర్భంలో తీరప్రాంత గ్రామ ప్రజలకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా 3200 గృహాలు నిర్మించామన్నారు. మున్సిపల్ ట్యాప్ వాటర్‌తోపాటు రూ.4 కోట్ల 30లక్షల వ్యయంతో అమృత్ స్కీంలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో 420ఎకరాల భూమి సేకరించామని తెలిపారు. ఇంత పెద్ద స్థాయిలో భూసేకరణ చేసి పేదలకు నివేసనా స్థలాలు ఇచ్చామన్నారు. గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలకు నివేసనా స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం 70వేల ఎకరాల భూమిని రూ.55వేల కోట్లతో సేకరించిందని తెలిపారు. రాష్ట్రంలో 22లక్షల ఇళ్లు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి రూ.45వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల 43వేల ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపి నందిగం సురేష్, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టీనా, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ విజయసారధి, విఠర్శో సంస్థ డైరెక్టర్ వేళాంగిణి రాజు కొలగాని, హౌసింగ్ డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.


జగనన్న కాలనీ ప్రారంభిస్తున్న ఎంపి మోపిదేవి వెంకటరమణ

మాదిగల విశ్వరూప మహాసభ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

వచ్చే శీతాకాల సమావేశాల్లో ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని, చట్టబద్రత కల్పించాలని, ప్రభుత్వాలు ఇచ్చిన మాట నిలబెట్టుకొని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు బుడంగుట్ల లక్ష్మీనరసయ్య మాదిగ డిమాండ్ చేశారు. మహా పాదయాత్ర నవంబర్ 7న చలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాన్ని స్థానిక స్టాలిన్ పేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా కో కన్వీనర్ పల్లెపోగు నాని మాదిగ, రమేష్ మాదిగ, ఎండ్లూరి ఐజక్ మాదిగ, కె ఏలీయ మాదిగ, విజయరాజు మాదిగ, పి యానాతాను మాదిగ, చిన్నా మాదిగ, మరియదాసు మాదిగ పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు


రక్తదానం చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ఎన్వి మెమోరియల్ నర్సింగ్ హోమ్‌లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ గోకతోటి హిమబిందుకు ఏబి పాజిటివ్ రక్తం అత్యవసరమైనట్లు వైద్యులు సూచించారు. బాధితుల విజ్ఞప్తి మేరకు రోటరీ బ్లడ్ బ్యాంకు ఛైర్మెన్ చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో అద్దంకి నివాసి నగరికంటి ఆంజనేయులు రక్తదానం చేశారు. చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సహించిన 420రక్తదానం అయింది. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చప్పిడి వీరయ్య, పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాన్ని కాపాడినట్లే నని, రక్త దానం చేసిన ఆంజనేయులును రోటరీ ప్రతినిధులు అభినందించారు. రక్తగ్రహీత హిమబిందు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాగేశ్వరరావు

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- సంతమాగులూరు

గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక స్థాయి బాల, బాలికలకు సరైన విద్యను అందించాలనే లక్ష్యంతో కార్డ్స్ సంస్థ పనిచేస్తుందని బాలబాట డిప్యూటీ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు తెలిపారు. బాలబాట డెవలప్మెంట్ ఆర్గనైజర్స్ కు గ్రామంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ బాలబాట ద్వారా గ్రామాలలో విద్యను అభివృద్ధి చేయాలన్నారు. బాల్య వివాహాలను, బాల కార్మిక వ్యవస్థను తగ్గించడానికి బాధ్యతతో పనిచేస్తున్నామని అన్నారు. శిక్షణలో ప్రతిజ్ఞ, డ్రిల్, బాలబాట నడిపే విధానం, చదువు ఆవశ్యకత గురించి తెలిపారు. అనంతరం డివోలకు కూరగాయ విత్తనాల ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమం లో ఏరియా కోఆర్డినేటర్స్ కె ప్రమీల, జార్జి, బి లాజర్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలతోనే ఆర్థిక వృద్ధి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల సమైక్య ఆధ్వర్యంలో జరుగుతున్న పొదుపు సంఘాల ప్రతినిధులకు గురువారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ సంఘాల అధ్యక్షులు ప్రత్యేకంగా గ్రూపు చర్యలు నిర్వహించి పొదుపు సంఘాలు బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. రేపల్లె ఏరియా కోఆర్డినేటర్ పుసులూరు రమాదేవి పలు సూచనలు చేశారు. ఎపిఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నూతన సభ్యుల స్థితిగతులను పరిశీలించి ఆర్థికంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు అధ్యక్షులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు కర్ర స్వరాజ్యలక్ష్మి, సీసీలు రజిని, హనోక్, సాంబయ్య, ఎకౌంటెంట్ శిరీష పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణానికి నోటీస్ ఇస్తాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేటపాలెం

'ఆక్రమణ కనిపించడం లేదా' అనే శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ప్రజాశక్తి ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వేటపాలెం పంచాయతీ కార్యదర్శి శవనం రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఆక్రమణలో ఉన్న దానికి నోటీస్ ఇచ్చి తొలగిస్తామన్నారు. ప్రస్తుతం వేసిన కొలతల ప్రకారం చేతి పంపు ప్లాట్ఫారం ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించామని అన్నారు.

ఓపీఎస్ కోసం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

నేటి నుంచి మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం బాపట్ల పాత బస్టాండ్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుండి జిల్లాలో తాలూకా, డివిజన్, మండల కేంద్రాల్లో ఈ నిరసన దీక్షలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఓపిఎస్ అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు దాని స్థానంలో నష్టదాయకమైన జిపిఎస్‌ను అమలుచేస్తానని చెప్పడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్లిక్ సెక్టార్‌ను నిర్వీర్యం చేసే విధంగా పాలన సాగిస్తున్నాయన్నారు. మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందించి పదవీ విరమణ అనంతరం జీవన భతి కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుగా ఉన్న పెన్షన్ విధానానికి తూట్లు పొడిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నీరుగార్చారన్నారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం రాష్ట్ర బాధ్యులతో చర్చలు జరిపి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షలో జిల్లా ఎంఈవోల సంఘం అధ్యక్షులు డి.ప్రసాదరావు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, సహాధ్యక్షులు భిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి మద్దాల సురేష్, యుటిఎఫ్ పట్టణ సీనియర్ కార్యకర్త కష్ణనారాయణ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే..

టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు, వైసిపి దుర్మార్గపు పాలనపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు 'మన ఊరు-మన ఉగ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలియజేశారు. గురువారం ఉదయం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం, సాయంత్రం కనిగిరి మండలంలోని రాగిమానిపల్లి, గుండ్లపాలెం, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాలలో మన ఊరు మన ఉగ్ర కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో ఉగ్ర పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. చైతన్యపరుస్తూ ముందుకు సాగారు. 'బాబుతో నేను' కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు వివరించారు. ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కనిగిరి మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, నుదురుపాటి సుబ్బయ్య, మాలపాటి ఓబుల్ రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, బాయ్‌మామ్, పాలూరి సత్యం, చింతలపూడి తిరుపాలు, గంగిరెడ్డి నాగిరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, కడప సుధాకర్, బాలు ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

అధికారులకు ఎస్‌పి మల్లికగర్గ్ సూచనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఈనెల 21 నేపథ్యంలో జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని పోలీస్ అమరవీరుల స్మతి స్థూపం వద్ద స్మతి పెరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్‌పి మలికా గర్గ్ గురువారం పరిశీలించారు. పరేడ్‌ను నిర్వహించడంలో సిబ్బందికి కొన్ని మెళకువలు, సలహాలను ఇచ్చారు. ఈ నెల 21న జరిగే పెరేడ్ ప్రదర్శనను మరింత ఉత్సాహంగా, అద్భుతంగా చేయాలని జిల్లా ఎస్‌పి సూచించారు. అక్కడ జరుగుతున్న ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ అమరవీరుల దినోత్సవ వేడుకలో భాగంగా నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాలు, చేపట్టాల్సిన చర్యలు విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వేడుకకు ముఖ్యఅతిథి, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల రాక, పార్కింగ్, పెరేడ్ నిర్వహణ వంటి విషయాలను కూలంకషంగా చర్చించి, తగిన ఆదేశాలు అధికారులకు జారీ చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పి (క్రైమ్)యస్.వి.శ్రీధర్‌రావు, ఎఆర్ ఏఎస్‌పి అశోక్‌బాబు, డిఎస్‌బి డిఎస్‌పి బి.మరియాదాసు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు చేదోడుగా ప్రభుత్వం: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


చేతివత్తులపై ఆధారపడిన బిసి కులస్తులకు ఆర్థిక సహాయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేదోడుగా నిలుస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జగనన్న చేదోడులో భాగంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో వరుసగా నాల్గో ఏడాది నిధులను జమ చేయటానికి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఇందుకు అనుబంధంగా ఒంగోలు కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, వివిధ బిసి కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందించారు. కార్యక్రమంలో మేదర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ లలితా నాంచారమ్మ, శ్రీ వైష్ణవ కార్పొరేషన్ ఛైర్మన్ టి.మనోజ్‌కుమార్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీదేవి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డి.లక్ష్మీనారాయణ, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బి.కరుణాకర్, నూర్‌బాషా/ దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సోఫియా, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పి.చెన్నకేశవరావు, ఈడిక కార్పొరేషన్ డైరెక్టర్ జె.ఏడుకొండలు, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఉషారాణి పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆర్థికాభివృద్ధి కోసమే 'చేయూత'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నిరుపేదలైన బీసీలంతా ఆర్థికంగా అభివద్ధి సాధించాలనే లక్ష్యంతో జగనన్న చేదోడు పథకాన్ని ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. జగనన్న చేదోడు పథకం నాలుగో విడత ఆర్థిక సహాయం కింద నగదు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎమ్మిగనూరులో బటన్ నొక్కి గురువారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని లబ్ధిదారులంతా తిలకించేలా అధికారులు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. తదుపరి కలెక్టర్ పి రంజిత్ బాషా, ఏపీ మార్కెటింగ్ శాఖ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి చేతుల మీద లబ్ధిదారులకు చెక్కరూపంలో నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ నాయీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.ఏడుకొండలు, జిల్లా బిసి సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి బి.అర్జునరావు, బిసి కార్పొరేషన్ ఇంచార్జ్ ఈవో చిట్టిబాబు పాల్గొన్నారు.

జిపిఎస్‌ను రద్దు చేయాలని

నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. జిపిఎస్‌ను రద్దు చేయాలని రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఒంగోలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవి వీరారెడ్డి మాట్లాడుతూ జిపిఎస్‌ను రాజకీయ ఎజెండాలో చేర్చాలని, జిపిఎస్‌ను రద్దు చేసే పార్టీలకే తమ ఓటు నినాదంతో ముందుకెళ్లాలని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి మాట్లాడుతూ ప్రభుత్వ నియామకాలలో ఓపిఎస్ లేకపోతే ఉద్యోగ విరమణ అనంతరం జీవన స్థాయి పడిపోతుందన్నారు. అనంతరం జిపిఎస్ కన్వీనర్ అబ్దుల్ హై మాట్లాడారు. 20వ తేదీ జిల్లాలో ప్రతి డివిజన్ కేంద్రంలో నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమవుతాయని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. నిరవధిక నిరాహార దీక్షకు సిఐటియు కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శేషయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియన్ నాయకులు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న యుటిఎఫ్ నాయకులు

కుటుంబసభ్యులకే అయితారామయ్యశెట్టి సత్రం

- హైకోర్టు ఉత్తర్వులతో కదలిక
- వీల్‌ఛైర్‌లో వచ్చి మరీ.. ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని నడిబొడ్డులో ఉన్న శ్రీఅయితారామయ్యశెట్టి సత్రం చివరకు వారసులకే దక్కింది. హైకోర్టు ఉత్తర్వుల అనుకూలంగా గురువారం నాడు దేవాదాయశాఖ అధికారులు వారసులకు ట్రస్టు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. కందుకూరు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పాత శింగరాయకొండ శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కార్యదర్శి పి.కష్ణవేణి, ఛైర్మన్ పామర్తి మాధవరావు ఆధ్వర్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు అయితారామయ్యశెట్టి సత్రం ట్రస్ట్‌బోర్డు మెంబర్లుగా ఆయన వారసులు అయితా వెంకటసుబ్బారావు, అయితా పిచ్చయ్య, అయితా పురుషోత్తములతో దేవాదాయశాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అయితా రామయ్యశెట్టి సత్రం రైల్వే రోడ్‌లో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉంటుంది. 1.30 ఎకరాల స్థలంలో సత్రాన్ని ఏర్పాటుచేసి.. పేద ప్రజల కోసం ఆనాడు వినియోగించారు. ఆ తర్వాత వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. వ్యాపారం చేసుకుంటూ ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో సత్రాన్ని కూల్చివేశారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సత్రాన్ని పునర్నిర్మాణం చేసి వ్యాపారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కానీ తెలుగుదేశం పార్టీ కూడా ఆ తర్వాత వదిలేసింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయితారామయ్యశెట్టి సత్రాన్ని మేము అభివద్ధి చేస్తామని చెప్పి.. అమరావతి చుట్టూ తిరిగి చేతులెత్తేశారు. చివరకు [illegible] అయితారామయ్యశెట్టి సత్రానికి వారసులు తామంటూ కుటుంబ సభ్యులు కోర్టుకు వెళ్లారు. అప్పటికే హైకోర్టులో దేవాదాయశాఖ, వ్యాపారుల మధ్య వార్ జరుగుతున్న నేపథ్యంలో సత్రాన్ని వారసులకే ఇస్తున్నట్లు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆ నేపథ్యంలో దేవాదాయశాఖ అధికారులకు ఉత్తర్వులు రావడంతో గురువారంనాడు దేవాదాయశాఖ అధికారులు ఆ కుటుంబసభ్యులతో స్థలం వద్ద ప్రమాణస్వీకారం చేయించారు. ఇందులో విచిత్రం ఏమిటంటే అయితారామయ్యశెట్టి సత్రం ప్రమాణ స్వీకారం చేసిన వారసుల్లో అయితే వెంకట సుబ్బారావు (93 సంవత్సరాలు) ఆసుపత్రిలో ఉండగా ఆయన నేరుగా అంబులెన్స్‌లో వచ్చి వీల్‌ఛైర్‌లో కూర్చుని దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన విధంగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ బచ్చు కోటేశ్వరరావు, కొత్తూరి శ్రీరంగనాయకులు, కె.విజయ్‌కుమార్, గాదంశెట్టి గుప్త, గంగిశెట్టి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



వీల్‌ఛైర్‌లో వచ్చిన వారసుడు వెంకట సుబ్బారావు